క్లుప్తంగా

తాడేపల్లి ఎస్‌ఐగా శ్రీనివాస్



తాడేపల్లిరూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్ కొత్త ఎస్‌ఐగా జె.శ్రీనివాస్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన ఎస్‌ఐ శ్రీనివాస్ తాడేపల్లి సీఐ కళ్యాణ్‌రాజును కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చారు. శ్రీనివాస్ ప్రకాశం జిల్లాకు చెందిన వ్యక్తి అయినా గుంటూరు జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్‌లలో బాధ్యతలు నిర్వహించారు.

చెత్తను తొలగించండి



ఫిరంగిపురం: చెరువు కట్ట సమీపంలోని డాక్టర్ వైఎస్సార్ హెల్త్‌సెంటర్‌కు వెళ్లే దారి అపరిశుభ్రంగా ఉంది. స్థానికులు చెత్తాచెదారాన్ని తీసుకొచ్చి దారికిరువైపులా వేస్తున్నారు. ఆ ప్రాంతమంతా అపరిశుభ్రంగా తయారైంది. వర్షాలు పడుతుండటంతో మురుగు, చెత్త నుంచి దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో హెల్త్ సెంటర్‌కు వెళ్లేవారు ముక్కుమూసుకొని వెళ్లాల్సి వస్తుందని ప్రజలు చెబుతున్నారు. పారిశుద్ధ్య కార్మికులతో చెత్త తీయిస్తున్నా మళ్లీ మళ్లీ అదే ప్రాంతంలో చెత్తను తీసుకొచ్చి వేస్తున్నారని అధికారులు చెబుతున్నారు. చెత్త అక్కడ వేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నిత్యావసరాలు పంపిణీ

తాడికొండ: తుళ్ళూరు మండలం లంక గ్రామాల్లోని ముంపు బాధితులు 160 కుటుంబాలకు బుధవారం మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ అమరావతి ముంపు ప్రాంతమనే దుష్ప్రచారాన్ని ఖండిస్తున్నామని, వర్షం పడితే ఎక్కడైనా నీళ్ళు రావడం సహజమేనని, గుంటూరులో కూడా నీరు వచ్చిందని పేర్కొన్నారు.

నీరు నిలిచిన ఖాళీస్థలాల్లో ఆయిల్ బాల్స్



తెనాలి: పట్టణంలో దోమల నివారణలో భాగంగా బుధవారం స్థానిక నాలుగో పారిశుధ్య డివిజన్ పరిధిలోని 12వ వార్డు డొంకరోడ్డులో నీరు నిల్వ ఉన్న ఖాళీస్థలాల్లో ఆయిల్ బాల్స్ వేశారు. మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న, ఆరోగ్య శాఖాధికారిణి హెలెన్ నిర్మల పర్యవేక్షించారు. ఖాళీస్థలాలు, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని కమిషనర్ బండి శేషన్న స్థానికులకు సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, శానిటరీ కార్యదర్శులు సంధ్య, శాంతి, హవీల, ప్రవీణ్, సాగర్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అనాథ శవానికి అంతిమ సంస్కారాలు

తెనాలి: పట్టణ స్వరాజ్ టాకీస్ సెంటర్లోని సాయిబాబు గుడి వద్ద మూడు దశాబ్దాలుగా భిక్షాటనతో జీవనం సాగిస్తున్న వృద్ధుడు మంగళవారం రాత్రి పొద్దుపోయాక మృతి చెందాడు. అతడు అనాథ కావటంతో సాయిబాబా గుడి కమిటీ విజ్ఞప్తి మేరకు పట్టణానికి చెందిన శ్రీశివలింగేశ్వరస్వామి భక్తబృంద సేవాసమితి ఆధ్వర్యంలో బుధవారం అంత్యక్రియలు చేశారు. సేవాసమితి అధ్యక్షుడు కుర్రా శ్రీను, సభ్యులు కలిసి, యాచకుడి మృతదేహాన్ని బుర్రిపాలెంరోడ్డులోని మహాప్రస్థానానికి తరలించారు. సంప్రదాయ పద్ధతిలో అంతిమ సంస్కారాలను పూర్తి చేశారు. శ్రీశివలింగేశ్వరస్వామి భక్తబృంద సేవా సమితి అనాథ శవాలకు చేస్తున్న అంతిమ సంస్కార సేవలను మహాప్రస్థానం సేవా సమితి కార్యదర్శి జెట్టి శివరామకృష్ణ అభినందించారు. గుంటూరుకు చెందిన స్వామి జ్ఞానప్రసన్న ఆశీస్సులతో ఆరేళ్లుగా ఆకలితో ఉన్నవారికి అన్నదానం చేయటం, అనాథలు, నిస్సహాయులుగా మరణించినవారికి అంత్యక్రియలను చేస్తున్నట్టు కుర్రా శ్రీను తెలిపారు. వీరి అస్తికలను తీసుకుని కాశీలోని గంగానదిలో నిమజ్జనం, పిండప్రదానం చేస్తున్నట్లు గుర్తుచేశారు. కార్యక్రమంలో పాలడుగు బ్రహ్మం పాల్గొన్నారు.

కామెల్ జాతీయ ప్రదర్శనకు ఏఎన్‌యూ విద్యార్థి

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఫైన్‌ఆర్ట్స్ విద్యార్థి సోనుదాస్ క్యామెల్ కంపెనీ నిర్వహిస్తున్న జాతీయ క్యాంప్, చిత్ర ప్రదర్శనకు ఎంపికయ్యాడు. కర్ణాటక రాష్ట్రం హంపిలో నవంబర్ 25 నుంచి 29 వరకు ఈ క్యాంప్ కొనసాగుతుంది. ఈ క్యాంప్‌లో ఎంపిక చేయబడ్డ వర్ణ చిత్రాలు వచ్చేయడాది జనవరిలో ముంబాయి జహంగీర్ ఆర్ట్ గ్యాలరీలో ప్రదర్శిస్తారు. ఈ సందర్భంగా నాగార్జున విశ్వవిద్యాలయ వీసీ ఆచార్య కె.గంగాధర రావు విద్యార్థిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫైన్ ఆర్ట్స్ విభాగం అసిస్టెంట్ కోఆర్డినేటర్ బి.శేఖర్ బాబు పాల్గొన్నారు.



నీరుకొండ ఎస్‌ఆర్‌ఎం వర్సిటీ సమీపంలోని పొలాల్లో వరద నీరు



తాడికొండ వద్ద పొలాల్లో కదలని నీరు

వెల్లువాగునా..!

వర్షాలు తగ్గుముఖం పట్టినా, నదీమతల్లి శాంతించినా, ఇంకా నీరుకొండ, తాడికొండ గ్రామాల పరిధిలోని పంట పొలాలను వరద నీరు వదలడం లేదు. వేలాది ఎకరాలు ఇంకా నీటిలోనే నానుతున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొండవీటి వాగు వరదనీరు మళ్లింపునకు శాశ్వత చర్యలు లేకపోవడం వల్లే ఈ దుస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏటా భారీ వర్షాలు కురిస్తే ఎస్‌ఆర్‌ఎం యూనివర్శిటీ కూడా నీటమునిగి సెలవులు ప్రకటించే పరిస్థితి ఉందని చెబుతున్నారు. కొండవీటి వాగు వరద నీటి మళ్ళింపునకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

– తాడికొండ



నిడమర్రు రోడ్డులో ఇదీ దుస్థితి

వ్యవసాయ కార్మికులను ఆదుకోవాలి

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలో వరద ముంపునకు గురైన ప్రాంతాల్లోని వ్యవసాయ కార్మికులను ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు కోరారు. బుధవారం దుగ్గిరాల మండల పరిధిలోని వీర్లపాలెం, పెదకొండూరు, గొడవర్రు గ్రామాల్లో ఆయన జెట్టి బాలరాజుతో కలిసి పర్యటించారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వరద వల్ల పంటలు దెబ్బతిని వ్యవసాయ కార్మికులు పనుల్లేక నానా ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. వ్యవసాయ కార్మికుల కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సహాయం అందించాలని, రెండు నెలలపాలు కుటుంబానికి 25 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు అందజేయాలని డిమాండ్ చేశారు. రుణవాయిదాల చెల్లింపును రెండునెలలు ఆపాలని, వడ్డీ మాఫీ చేయాలని, ఉపాధి హామీ పనులు కల్పించాలని, గతంలో చేసిన పనులకు పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని, పంటలు నష్టపోయిన కౌలు రైతులకు, రైతులకు పంట నష్టం అంచనా వేసి నష్టపరిహారం వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కూలీలు కర్రి నాగేశ్వరరావు, ఎస్.శ్యామల, కె.సత్యవతి, కె.దీనమ్మ, బి.శ్యామల, బి.పద్మజ, పి.కృపాకర్‌రావు పాల్గొన్నారు.



వ్యవసాయ కార్మికులతో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు, జెట్టిబాలరాజు తదితరులు

పంట నష్ట జాబితాలు చూసుకోండి

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలో ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల దెబ్బతిన్న వరి పంట పొలాలను గ్రామస్థాయి అధికారులు పరిశీలించి నమోదు చేశారని, పంట నష్టం జాబితాలను అన్ని రైతు సేవా కేంద్రాల వద్ద, సచివాలయాల వద్ద సామాజిక తనిఖీ కోసం ప్రదర్శిస్తున్నామని మండల వ్యవసాయ అధికారి పి.శిరీష తెలిపారు. రైతులు తమ పేర్లు, ఇతర వివరాలు కచ్చితంగా ఉన్నాయో, లేదో పరిశీలించుకోవాలన్నారు. అభ్యంతరాలు ఉంటే వెంటనే వ్యవసాయ సహాయకులకు తెలియజేయాలని కోరారు.

విద్యుత్ నిఘా విభాగం తనిఖీలు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలోని పలు గ్రామాల్లో విద్యుత్ నిఘా విభాగం ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమరావతి డివిజన్ ఏఈ సిహెచ్ రాంభొట్ల మాట్లాడుతూ మొత్తం 2,999 సర్వీసులను తనిఖీ చేశామని, వాటిలో అనుమతి పొందిన లోడ్ కంటే ఎక్కువగా వినియోగించుకుటున్న గృహ, వాణిజ్య, పారిశ్రామిక సర్వీసుల్లో 100 గుర్తించామని, జరిమానా రూపంలో రూ. 5,73,600 వసూలు చేయాలని నిర్ణయించామని తెలిపారు. దాడులలో అధికారులు అక్కల సత్యనారాయణ, కె.వి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న అమరావతి డివిజన్ ఏఈ రాంభొట్ల

గణపతీ నమోస్తుతే..



ఫిరంగిపురం రామమందిరం వద్ద పూజలు చేస్తున్న భక్తులు



ఫిరంగిపురంలోని పోలేరమ్మ ఆలయం వద్ద పూజల్లో యువకులు

ఫిరంగిపురం/తాడేపల్లి రూరల్/మేడికొండూరు : గణపతి నవరాత్రి ఉత్సవాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన చలువ పందిళ్ల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. పార్వతీసుతునికి ప్రణమిల్లుతున్నారు. ఫిరంగిపురంలోని రామ మందిరం వద్ద రజక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహం వద్ద విశేష పూజలు, అష్టోత్తర, సహస్రనామ అర్చనలు చేశారు. 30 ఏళ్లుగా గణపతి విగ్రహం ఏర్పాటు చేసి పూజలు నిర్వహిస్తున్నట్లు సంఘం సభ్యులు తెలిపారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం కోలాటాలు, అఖండ భజన సంకీర్తనలు ఏర్పాటు చేశారు. తూర్పుబజారులోని పోలేరమ్మ గుడివద్ద శ్రీకృష్ణదేవరాయ యువ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గజాననుడి విగ్రహానికి విశేషంగా పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. 21 ఏళ్లుగా చవితి మండపాన్ని ఏర్పాటు చేసి పూజలు నిర్వహిస్తున్నట్లు సంఘ యువకులు తెలిపారు. ఐదోరోజు నిమజ్జనం చేయనున్నట్లు వివరించారు.

- కొత్తూరు తాడేపల్లి మారుతీ నగర్‌లోని గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా బుధవారం భక్తులకు అన్నదానం నిర్వహించారు. సుమారు 3 వేల మందికిపైగా అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి దారా దాసు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు ఉద్దంటి ధనుజ్ కుమార్, గణేష్ చైతు పాల్గొన్నారు.
- మేడికొండూరు మండల పరిధిలోని డోకిపర్రు, మేడికొండూరు, జంగంగుంట్లపాలెం, పాలడుగు, విశదల, గుండ్ల పాలెం, సిరిపురం, వరగాని భీమినేనివారిపాలెం, కొర్రప్రాడు, మంగళగిరిపాడు, పొట్లపాడు, మందపాడు గ్రామాల్లో ఐదో రోజు బుధవారం భక్తులు పలు రకాల అలంకరణలతో స్వామికి విశేష పూజలు నిర్వహించారు.



కొత్తూరు తాడేపల్లిలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం



అన్నదానం నిర్వహిస్తున్న గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు



మేడికొండూరులో గణపతి విగ్రహం వద్ద పూజల్లో మహిళలు

మందుబాబుల హల్‌చల్

- నిమజ్జనోత్సవంలో వీరంగం
- ఇద్దరు యువకులు అరెస్ట్

తాడేపల్లిరూరల్: ఉండవల్లి సెంటర్‌లో శ్రీ గణేష్ యూత్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం తెల్లవారుజామున వినాయక విగ్రహం నిమజ్జనోత్సవం జరుగుతుండగా సంబంధంలేని ఇద్దరు యువకులు వచ్చి మద్యం మత్తులో హల్‌చల్ చేశారు. ఓ వ్యక్తిపై దాడికి పాల్పడ్డారు. అక్కడే ఉన్న కమిటీ సభ్యులు వారిని అడ్డుకోబోగా రెచ్చిపోయి ఊరేగింపునకు ద్విచక్రవాహనాలు అడ్డుపెట్టి దాడికి యత్నించారు. విషయం తెలుసుకున్న తాడేపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని యువకులను అడ్డుకున్నారు. యువకుల బంధువులు వచ్చి పోలీసులపైనా దౌర్జన్యానికి పాల్పడడంతో పోలీసులు గొడవకు కారణమైన బాజీ, నాగరాజును అదుపులోకి తీసుకుని వారిద్దరిపై కమిటీ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. అయితే ఉత్సవంలో పాల్గొన్న వారి సెల్‌ఫోన్‌లు చోరీ చేసేందుకు యువకులు ఈ గొడవకు దిగారని కమిటీ సభ్యులు ఆరోపిస్తున్నారు.



మద్యం మత్తులో పోలీసులతోనూ దౌర్జన్యంగా మాట్లాడుతున్న యువకుడు

పోషకాహారంతో రక్తహీనత దూరం

ఐసీడీఎస్ జిల్లా డైరెక్టర్ ఉమాదేవి

తెనాలి: పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకుంటే రక్తహీనత నుంచి దూరంగా ఉండొచ్చని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ గుంటూరు జిల్లా డైరెక్టర్ ఎం.ఉమాదేవి సూచించారు. పోషణ మాసోత్సవం సందర్భంగా రూరల్ మండలంలోని కొలకలూరు గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. రక్తహీనత కలిగిన తల్లులు, గర్భిణులకు పలు సూచనలు చేశారు. ఆకు కూరలు తీసుకోవాలని ముఖ్యంగా ప్రతిరోజూ మునగాకును ఆహారంతో కలిపి తీసుకోవాలని సలహానిచ్చారు. కుటుంబ సభ్యులంతా కలిసి పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలనీ, ఉన్నతమైన ఆలోచనలు కలిగి జీవించాలనీ చెప్పారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆఫీసర్ డాక్టర్ ఎం.సునీత, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుబ్బారావు, డీ3 శారద సర్వీస్ సొసైటీ, తెనాలి వ్యవస్థాపకురాలు డాక్టర్ శారద, నోడల్ అధికారి టి.శ్రీవాణి, సూపర్‌వైజర్ హిమబిందు, కొలకలూరు సెక్టారు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. ఆ తర్వాత సమీపంలోని ఖాజీపేటలో తల్లులు, గర్భిణులు రక్తహీనత రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఐసీడీఎస్ కొలకలూరు సూపర్‌వైజర్ హిమబిందు సూచనలు చేశారు. అనంతరం కొలకలూరు–2 సెంటర్ అంగన్‌వాడీ కేంద్రంలోనూ తల్లులతో సమావేశం నిర్వహించారు.



ఎహెచ్‌సీలతో వైద్యులతో ఉమాదేవి

అమర కళాకారుల సంస్మరణ



తెనాలి: పట్టణ గాంధీనగర్‌లోని ఇస్కఫ్ కార్యాలయంలో బుధవారం అమర కళాకారుల సంస్మరణ సభ నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి, అభ్యుదయ కళాసమితి సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమానికి తన్నీరు శివశంకర్ అధ్యక్షత వహించారు. సినీ నటుడు, ప్రజానాట్యమండలి జాతీయ నాయకుడు 'రక్తకన్నీరు' నాగభూషనం, లక్ష్మీ పెరుమాళ్లు, కోడూరు అచ్చయ్య, రూపశిల్పి కుమార్‌లను స్మరించుకున్నారు. కళాకారులు చందు సూర్య, చిందా భాస్కరరావు, ఈపూరు ప్రేమ్ కుమార్, దాస్యం బాబూరావు, బొల్లిముంత కృష్ణ పాల్గొన్నారు.

నూకాలమ్మ ఆలయ హుండీ అపహరణ

తెనాలిరూరల్: స్థానిక ఇస్లాంపేట పరిధిలోని కబేళా వంతెన సమీపంలోని శ్రీ నూకాలమ్మ తల్లి ఆలయంలోని హుండీ చోరీకి గురైంది. బుధవారం ఉదయం ఎనిమిది గంటల సమయంలో దేవస్థానాన్ని శుభ్రం చేసేందుకని వచ్చిన స్థానిక మహిళ సింగంపల్లి మల్లేశ్వరి అమ్మవారి ముందు ఉండాల్సిన హుండీ చోరీకి గురైనట్లు గుర్తించారు. వెంటనే వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎన్నో ఏళ్లుగా ఈ దేవాలయం ఇక్కడ ఉండగా శిథిలావస్థకు చేరడంతో సుమారు ఆరు నెలల క్రితం కొత్తగా నిర్మాణం ప్రారంభించారు. రాత్రి 11 గంటల వరకూ తాము అక్కడే ఉన్నామని ఆ తర్వాత ఎవరో వచ్చి హుండీ అపహరించుకు వెళ్లి ఉంటారని స్థానికులు తెలిపారు. హుండీలో సుమారు రూ.70 వేల వరకు నగదు ఉంటుందని భావిస్తున్నారు.

హైస్కూలులో 'స్వచ్ఛతా పక్వాడా'

తెనాలి: పట్టణ అయితానగర్‌లోని ఎస్‌ఎస్‌ఎస్ మున్సిపల్ హైస్కూలులో బుధవారం స్వచ్ఛత పక్వాడా కార్యక్రమన్ని నిర్వహించారు. పరిశుభ్రత ఎలా పాటించాలి... ఎలా కలిగిఉండాలి...ఎలా ప్రోత్సహించాలి...అనే అంశాలపై ఉపాధ్యాయులు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. గోళ్లను కత్తిరించుకోవటం, శుభ్రమైన నీటితో స్నానం చేయటం, ఉతికిన దుస్తులు ధరించటం, రోజుకు రెండుసార్లు పళ్లుతోముకోవటం మంచి అలవాట్లను పాటించాలని సూచించారు. విద్యార్థులతో చేతుల పరిశుభ్రంగా కడుక్కోవటాన్ని నేర్పారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయిని ప్రసూనాదేవి మాట్లాడుతూ, ఆరోగ్యంగా జీవించటానికి శుభ్రత, పరిశుభ్రత ఆవశ్యకతను వివరంచారు. ఆ ప్రకారం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. బెల్లంకొండ వెంకట్ కార్యక్రమన్ని నిర్వహించగా, స్వర్ణమంజరి, రాబియా బాసం తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భూముల రికార్డులు సరిచేయాలని వినతి

తెనాలిరూరల్: తమ భూములు రెవెన్యూ రికార్డుల్లో దేవదాయ శాఖ భూములుగా కనబడుతున్నాయని, వెంటనే సరిచేయాలని తెనాలి మండలం సంగంజాగర్లమూడి గ్రామానికి చెందిన సుమారు 60 మంది రైతులు తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణను బుధవారం రాత్రి కలసి విజ్ఞప్తి చేశారు. 1930 నుంచి గ్రామ పరిధిలోని భూములు తమ పేరిట ఉన్నాయని, అందుకు సంబంధించిన రిజిస్ట్రేషన్ల పత్రాలు, పాస్‌పుస్తకాలు తమ వద్ద ఉన్నాయని తహసీల్దార్‌కు విన్నవించారు. తమ భూములను 2019లో దేవాయ శాఖ అధికారులు ఆ శాఖకు చెందిన భూములంటూ గ్రామస్తుల దృష్టికి తీసుకొచ్చారని, ఎవరికి ఎటువంటి నోటీసులివ్వకుండా రెవెన్యూ శాఖతో కలసి భూములను దేవదాయ శాఖకు చెందినవిగా రికార్డుల్లో మార్పులు చేశారని తెలిపారు. దీనిపై చర్యలు తీసుకుని రికార్డుల్లో మార్పులు చేయాలని కోరారు. ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. దీనికి తహసీల్దార్ సమాధానమిస్తూ రైతుల సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని, ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.



తహసీల్దార్ గోపాలకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

వాతావరణ కాలుష్యంతో ఆరోగ్యంపై దుష్ప్రభావం

తెనాలిరూరల్: వాతావరణ కాలుష్యం ఆరోగ్యంపై దుష్ప్రభావం చూపుతోందని కొలకలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ సుబ్బారావు అన్నారు. వాతావరణ కాలుష్యం, దుష్ప్రభావాలపై కొలకలూరులో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని చెప్పారు. వాయు కాలుష్యంతో ఊపిరితిత్తులకు సంబంధించి సమస్యలు తలెత్తుతాయని తెలిపారు. ఊపిరితిత్తులు, గుండె సమస్యలున్న వారు జాగ్రత్తగా ఉండాలని, వాలు కాలుష్యం ఉన్న ప్రదేశాలకు వెళ్లకపోవడం మేలన్నారు. సిగరెట్లు తాగడం, ట్రాఫిక్ ఎక్కువగా ఉండే ప్రదేశాలకు వెళ్లడం, బాణసంచా కాల్చడం వంటి పనులు చేయకూడదని సూచించారు. లక్ష్మీప్రసన్న, ఎం.వెంకటరెడ్డి, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు ర్యాలీలో పాల్గొన్నారు.



ర్యాలీలో డాక్టర్ సుబ్బారావు, సిబ్బంది

రాహుల్ వ్యాఖ్యలు అభ్యంతరకరం

తెనాలిరూరల్: అమెరికా పర్యటనలో ఉన్న రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి టి.అనంతాచార్యులు అన్నారు. స్థానిక మారీసుపేటలో బుధవారం సాయంత్రం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో అగ్ర నాయకుడిగా లోక్‌సభలో ప్రతిపక్ష హోదాలో ఉన్న రాహుల్ గాంధీ అమెరికాలోని డల్లాస్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొని ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీలు మహిళలపై చిన్నచూపు కలిగి ఉన్నాయని మాట్లాడటం బాధాకరమని అన్నారు. విదేశాలకు వెళ్లినప్పుడు మాతృదేశం గురించి మంచి మాటలు మాట్లాడాలి కానీ ఇటువంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టమన్నారు. సమావేశంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు అడపా సంపత్ రాయుడు, తెనాలి మండల అధ్యక్షుడు కడియాల నంద కిషోర్, గుంటూరు పార్లమెంట్ అధ్యక్షుడు కఠారి వాసుదేవ నాయుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అనంతాచార్యులు

భర్తపై దాడిచేసిన భార్యపై కేసు

పట్నంబజారు: భర్తను కొట్టి బిడ్డను ఎత్తుకెళ్లిన ఘటనలో భార్య, ఆమె బంధువులపై కేసు నమోదైంది. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్వర్ణాంధ్రనగర్‌కు చెందిన అంబేద్కర్‌కు గత 12 ఏళ్ల క్రితం పెదకూరపాడుకు చెందిన రోజా మేరితో వివాహమైంది. వారికి అభినవ్ అనే కుమారుడు ఉన్నాడు. భార్యభర్తల మధ్య వివాదం నేపథ్యంలో ఇరువురు వేర్వేరుగా ఉంటున్నారు. అయితే అభినవ్ తన తండ్రి వద్ద ఉంటున్నాడు. ఈక్రమంలో బుధవారం చంద్రమౌళినగర్‌లోని భాష్యం స్కూల్ వద్ద అభినవ్‌ను దింపేందుకు వెళ్లిన తండ్రి అంబేద్కర్‌పై రోజారాణి, ఆమె బంధువులు దాడిచేసి గాయపరిచి బాలుడిని తీసుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బాణసంచా దూసుకెళ్లి ఆటో ప్రయాణికులకు గాయాలు

పట్నంబజారు: వినాయక చవితి నిమజ్జన కార్యక్రమంలో అపశృతి చోటు చేసుకుంది. తెలిసిన సమాచారం మేరకు నల్లచెరువులోని వినాయకుడి విగ్రహ మహోత్సవ కార్యక్రమంలో బాణా సంచా కాలుస్తున్న సమయంలో బాణా సంచా ఆటోలోకి దూసుకెళ్లి పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వారిని హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. దీనిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదు.